## 10 టీవీ రిపోర్టర్ జహీరుద్దీన్ పరామర్శించిన ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల జూలై 22 (వుదయం ప్రతినిధి) జగిత్యాల 10 టీవీ రిపోర్టర్ ఎండి జహీరుద్దీన్ కి గుండె శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న ఎండి జహీరుద్దీన్ ను మంగళవారం వారిని వారిని స్వగృహంలో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ పరామర్శలో ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తో పాటు రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు టీవీ సూర్యం తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ...

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్ పల్లి జూలై 22 (వుదయం విలేఖరి) మెట్పల్లి పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెట్పల్లి పట్టణ మెట్పల్లి మండలం ఇబ్రహీంపట్నం మండలానికి సంబంధించిన 5 లక్షల 68 వేల 500 రూపాయల విలువ గల 29 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేసిన కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తో పాటు మెట్పల్లి పట్టణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బోయిన్పల్లి చంద్రశేఖర్ రావు భారత రాష్ట్ర సమితి పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు పలువురు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

### కోరుట్ల నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు..



కోరుట్ల జూలై 22 (వుదయం ప్రతినిధి) కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పలు సమస్యల పై ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు పిఏ నరేష్ కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు పిఏ నరేష్ కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల అంజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు8

## కొత్త చట్టాల పైన మహిళలకు షీ టీం అవగాహన సదస్సు.

బెజ్జూర్ జులై 22 (వుదయం ప్రతినిధి)కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ లాల్ పాటిల్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ ఏఎస్పి చిత్తరంజన్ పర్యవేక్షణ లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాలలో ప్రభుత్వ పాఠశాల లో షీటీమ్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షీటీమ్ టీం ఇంచార్జ్ ఎ.ఎస్.ఐ సునీత గారు మాట్లాడుతూ. మహిళలపై హింస , ఈవ్టీజింగ్ , సైబర్ క్రైమ్ లకు ఎవరైనా గురి అయినట్లయితే వెంటనే షీటీం ను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల అయినా ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీం , పనిచేస్తున్నాయని, అలాగే ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు లేదా షీ టీం నెంబర్ 87126 70565 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ నెంబర్ 1930 సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె. దేవాజి ఎస్సైలు పోలీస్ సిబ్బంది మరియు సిబ్బందితో పాటు షీ టీం సభ్యులు బి.రమదేవి, ఏ.స్వప్న,బి.శ్రీనివాస్ పాల్గొనడం జరిగింది.

# జీవో నం.49 తాత్కాలిక నిలుపుదల కేవలం కంటి తుడుపు చర్యే, రద్దు చేసే

-వరకు పోరాటాలు విరమించేది లేదు.

-సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు.

బెజ్జూర్ జులై 22 (వుదయం ప్రతినిధి) కాగజ్ నగర్ పట్టణంలోని సర్సిల్క్ ఎమ్మెల్యే నివాసంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నం.49 ను తాత్కాలికంగా నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిన్న సాయంత్రం మెమో ఇచ్చిందని తెలిపారు. ఆదివాసి సంఘాలు, భారతీయ జనతా పార్టీ మరియు వివిధ ప్రజా సంఘాలు నిన్న నిర్వహించిన ఏజెన్సీ ప్రాంతాల బంధు సంపూర్ణం కావడంతో ప్రభుత్వం దిగివచ్చి ఈ మెమో ఇచ్చిందని తెలిపారు. ఈ జీవోను తాత్కాలికంగా నిలుపుదల చేయడం కేవలం కంటి తుడుపు చర్య అని, జీవో రద్దు చేసే వరకు పోరాటాలు విరమించేది లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తేనే జీవో తెచ్చామని కాంగ్రెస్ నాయకులు బీరాలు పలికారని, ఇప్పుడు తాత్కాలిక నిలుపుదల ఆర్డర్స్ ఇవ్వడానికి కేంద్రాన్ని సంప్రదించారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రమేయం లేని అంశంలో భారతీయ జనతా పార్టీని టార్గెట్ చేసుకొని విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఇచ్చిన ఉత్తర్వుల వలన వారి నిజ స్వరూపాన్ని బయట పెట్టుకున్నారని అన్నారు. జీవో రద్దుకై ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచేందుకు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని, అలాగే నెలాఖరు వరకు జీవోను రద్దు చేయని పక్షంలో, ఆగస్టు మొదటి వారంలో నిరవధిక నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, సింధం శ్రీనివాస్, బాల్క శ్యామ్, మాజీ ఎంపిపి మనోహర్ గౌడ్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు చిప్పకుర్తి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ తిరుపతి, సాంబయ్య, గణపతి లింగమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కువైట్ దేశంలో చిక్కుకున్న బాధితున్ని స్వదేశానికి తీసుకొస్తాం : ఎమ్మెల్యే బొజ్జు



జన్నారం, జూలై 22(వుదయం విలేకరి) కువైట్ దేశంలో చిక్కుకున్న బాధితున్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గొర్రె శాంతయ్య కువైట్ దేశంలో చిక్కుకుపోయాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి కుటుంబానికి ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని గొర్రె శాంతయ్య కువైట్ దేశం నుండి మన దేశానికి రప్పించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్, మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్య, రాంపూర్ మాజీ సర్పంచ్ అలుగునూరి పద్మారావు, సయ్యద్ సమీర్, నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ బీసీ గురుకుల విద్యార్థుల అనుమానాస్పద మృతిపై బీసీ రాజ్యాధికార సమితి మహిళా నాయకుల నిలదీత





హైదరాబాద్,జూలై 22(వుదయం పతినిధి): ఎస్సీ ఎస్టీ బీసీ గురుకులాల్లో నాణ్యమైన విద్య ,సరైన సదుపాయాలు లోపించడం ,చిన్నారుల ఆత్మహత్యలు , మరణాలపై బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర మహిళా నాయకురాళ్లు గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు భండారు పద్మావతి నేతృత్వంలో సంక్షేమ భవన్ అధికారులను నిలదీసారు. ముఖ్యమంత్రి స్వయంగా నిర్వహిస్తున్న విద్యాశాఖలో అనేక అవక తవకలు తెలెత్తడంతో పాటు ఇటీవల వరుసగా గురుకులాలలో పసిపిల్లలు చనిపోవటం తీవ్రంగా బాధిస్తున్న విషయం అని బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారి పద్మావతి తీవ్రమైన స్వరంతో ఆందోళనకు దిగారు. హైదరాబాదులోని చాచా నెహ్రూ పార్కు వద్ద గల డిఎస్ఎస్ భవన్ నందు బీసీ రాజ్యాధికార సమితి మహిళా నాయకురాళ్లు సహచర మహిళా బృందం మరియు ఇతర కార్యకర్తలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు .అందుబాటులో అధికారులు లేకపోవడం, అధికారులు నిర్లక్ష్య%శీ%గా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో పద్మావతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న విద్యా శాఖలో పిల్లల మరణాలు అత్యంత బాధాకరమన్నారు.. ప్రభుత్వం తక్షణమే నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, పిల్లలు మానసికమైన ఆందోళనకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ విద్యార్థుల మరణాలను అధికారులకు ఆపాదించి చేతులు దులుపుకోవడం. నైతిక భాద్యత నుండి తాను తప్పుకోవడమేనని ఇది మంత్రిగా ఎంతవరకు సమంజసం అని ఎద్దేవా చేశారు..,ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమే ప్రజలకు జవాబుదారీగా ఉండాలని తెలిపారు.. ఇప్పటికైనా అధికారులు క్రమశిక్షణ పాటించి గురుకులాలను తరచుగా సందర్శించి గురుకులాలలో చేరిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పిల్లల్ని తమ బిడ్డలుగా భావించి వారిని సంరక్షించాల్సిన బాధ్యత అధికారులేదని తెలిపారు. గురుకులాలలో వెంటనే నాణ్యమైన ఆహారము, విద్య, వసతులతో పాటు మంచి రక్షణ కల్పించాలని లేకుంటే తల్లిదండ్రుల పక్షాన తమ నిరసన మరింత ఉధృతంగా ఉండబోతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో గ్రేటర్ మహిళా ఉపాధ్యక్షురాలు తాళ్ల భాగ్యలక్ష్మి, శారద, మడత కిశర్ తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేట్‌లో ఊర దేవతల పండుగ





నిజాంసాగర్, జుల్కె 22(వుదయం ప్రతినిధి): నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామంలో మంగళవారం రోజున గ్రామస్థులు ఊర దేవతల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయం న్కెవేద్యాలను తమ తమ ఇళ్ళల్లో తయారు చేసుకుని వాటిని బోనాలలో ఉంచి బోనాలను తలపై ఎత్తుకుని డప్పు చప్పుళ్ళు, పోతరాజుల నృత్యాల నడుమ అమ్మవార్ల ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ గ్రామాన్ని చల్లంగ చూడు తల్లీ అంటూ అమ్మవార్లను వేడుకున్నారు. అదేవిధంగా గ్రామస్థులందరూ గ్రామశిరులో వనభోజనాలు చేశారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాలను సద్వినియోగం చేసుకోండి .

సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.

బెజ్జూర్ జులై 22 (వుదయం ప్రతినిధి)కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఈ రోజు 58 మందికి కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ కింద రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను ఆడపిల్లల పెళ్లి కోసం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ పథకంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు గారు పిలుపునిచ్చారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న వారు బిల్లులతో సహా దరఖాస్తు చేసుకుంటే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయాన్ని ఇప్పించడం జరుగుతుందని, వైద్యానికి ముందే తనని సంప్రదిస్తే హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చికిత్స చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, ఎమ్మార్వో మధుకర్, మున్సిపల్ డిఈ రమాదేవి, టీపీఓ యశ్వంత్, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, సింధం శ్రీనివాస్, బాల్క శ్యామ్, సుమన్, వంశీ, రెహాన్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## బర్త్ డే సందర్భంగా సేవాగుణం చాటుకున్నా మోక్షజ్ఞ



బెల్లంపల్లి, జులై22 (వుదయం ప్రతినిధి) తాండూరు మండల రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన బీజేపీ 137వ బూత్ అధ్యక్షులు జాడి ప్రశాంత్ మేఘన దంపతుల కుమారుడు మోక్షజ్ఞ రెండవ పుట్టిన సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు, రోగులకు అరటిపండ్లు బ్రెడ్ పాకెట్స్ , ఫ్రూటీ పంపిణీ చేసి సేవాగుణం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గసభ్యులు కేశెట్టి విజయ్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఏముర్ల ప్రదీప్, మండల ప్రధానకార్యదర్శి ఉప్పుట్ల దుర్గచరన్, నాయకులు ఏముర్ల ప్రవీణ్, జిల్లపల్లి అరుణ్, జాడి గోపాల్, అవినాష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రెండు బస్తాల బియ్యం అందజేత



జన్నారం, జూలై 22(వుదయం విలేకరి) పీ సీ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతురాలు కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. మండలంలోని మందపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మామిడి పెల్లి కాంత కుటుంబానికి పీసీఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 25 కేజీలవి రెండు బియ్యం బస్తాలను ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ అందజేశారు.

ఈ కార్యక్రమం లో పౌండేషన్ సభ్యులు, పొనకల్ మాజీ ఎంపిటిసి రాగుల శంకర్, ప్రశాంత్, భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు: ఎస్ఐ అనూష




జన్నారం, జూలై 22(వుదయం విలేకరి) సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జన్నారం ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. మంగళవారం రోజున ఆమె మాట్లాడుతూ వాట్సప్ గ్రూపులలో కులం, మతం, రాజకీయాలకు సంబంధించిన తప్పుడు వార్తలను, విద్వేషపూరితంగా రెచ్చగొట్టే వార్తలను ప్రచారం చేసినట్లయితే ఆ గ్రూప్ అడ్మిన్ తో పాటు విషయాన్ని పోస్ట్ చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోబడునని ఆమె హెచ్చరించారు. ఈ విషయాన్ని వాట్సప్ గ్రూప్ అడ్మిన్లు సభ్యులు గమనించాలని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశానుసారం రేషన్ కార్డుల పంపిణీ



నిజాంసాగర్, జుల్కె 22(వుదయం ప్రతినిధి): జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఇచ్చిన ఆదేశాల మేరకు నిజాంసాగర్ మండలంలోని గ్రామ గ్రామాన అర్హులైన లబ్దిదారులకు మంజూరైన రేషన్ కార్డులను స్థానిక కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు రేషన్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమం పిట్లం మార్కెట్ కమిటీ చ్కెర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్‌ల ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ తహసిల్దార్ బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైష్ణోదేవీ ఆలయ మార్గంలో విరిగిపడిన కొండచరియలు..

జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లాలోని వైష్ణోదేవి మందిరానికి వెళ్లే పాత ట్రాక్‌పై సోమవారం భారీ కొండచరియలు విరిగిపడటంతో 70 ఏళ్ల తీర్థయాత్రికుడు మృతి చెందగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. త్రికూట కొండలపై ఉన్న పుణ్యక్షేత్రాన్ని సందర్శించే తీర్థయాత్రికులు, బేస్ క్యాంప్ ఉన్న కాట్రా పట్టణంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడిన బరువుకు బుకింగ్ కార్యాలయం, ఓ ఇనుప నిర్మాణం కూలిపోయాయని తెలిపారు. కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో యాత్రను అనేక గంటలపాటు రద్దుచేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీర్థయాత్రికుడి మరణంపై విచారం వ్యక్తం చేయడమేకాక, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటన ఉదయం 8.30 గంటలకు బంగంగా సమీపంలోని గుల్షన్ కా లంగర్ వద్ద జరిగింది, యాత్ర ప్రారంభ స్థానం అయిన ఇక్కడ పొట్టి గుర్రాలు నడిపేవారు.. యాత్రికులను 12కిమీ. దూరంలో ఉన్న గుహ మందిరానికి తీసుకెళ్లేందుకు పేర్లను నమోదుచేసుకోడానికి గుమిగూడి ఉంటారు.

# రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవు

**-దరఖాస్తుల తిరస్కారానికి సరైన కారణాలు చూపాలి**
**-ఆగస్టు 15 నాటికి వీలైనన్ని భూ సమస్యలు పరిష్కరించాలి**
**-ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏసమస్యా రాకూడదు**
**-లబ్దిదారులకు దగ్గరలోని ఉచిత ఇసుక ఇవ్వాలి**
**-జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్,**
**-సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





భద్రాద్రి కొత్తగూడెం జూలై 22 ( వుదయం ప్రతినిధి ):తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాద్యత జిల్లా కలెక్టర్లదేనని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసినప్పుడే దాని ఫలితాలు సామాన్యులకు అందుతాయని అన్నారు. మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సామాన్యులను ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం ఉందని ఇది పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో 8.65లక్షల దరఖాస్తులు వచ్చాయని ఇందులో ప్రధానంగా సాదాబైనామా,సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్ , అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్ కు సంబంధించి సుమారు 6 లక్షల దరఖాస్తులు వచ్చాయని వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్టు 15వ తేదీలోగా వీలైనన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్దం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్దిదారుల వివరాలను ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు. దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టం వచ్చిన రీతిలో తిరస్కరించకూడదని, తిరస్కారానికి గల కారణాలను లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్దాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిపీవోలకు జె ఎన్ టి యు ఆధ్వర్యంలో లైసెన్స్ డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేసుకొని పకడ్బందీగాపరీక్ష నిర్వహించాలన్నారు. ఇంటి నిర్మాణంలో పేదవాడికి ఏ సమస్య రాకూడదు పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ధరలు, చెల్లింపులు, ఇసుక, సిమ్మెంట్, స్టీల్ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏ సమస్య రాకుండా చూడాలని అలాగే ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని , ఇది సరైన విధంగా లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలో ఇసుక అందేవిధంగా చూడాలన్నారు. బేస్‌మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబాటులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్దిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్య కాదని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నాకూడా ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని అయితే సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించి లబ్దిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. 2 బిహెచ్‌కే ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టం 2025 అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఒకవేళ తిరస్కరణకు గురైతే దానికి గల కారణాలను పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఐదు రోజుల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పూర్తి వివరాలు నివేదికలు అందజేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మాణం మొదలు పెట్టని వారిని గుర్తించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంటు, స్టీలు ధరలు నియంత్రించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దశల వారీగా డబ్బులు జమ అయ్యే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అలసత్వం ప్రదర్శించరాదని అధికారులను హెచ్చరించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవ లక్ష్యాలను త్వరితగతిని పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులు సహకారంతో విస్తృతంగా తాటి చెట్లు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, పిడి హౌసింగ్ రవీంద్రనాథ్, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్య, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్మైల్ ట్రైన్ ఇండియా గుడ్‌విల్ అంబాసిడర్‌గా సినీ నటి పావని గంగిరెడ్డి

**-తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో గ్రహణం మొర్రి సమస్యపై అవగాహన కోసం.**

హైదరాబాద్, జూలై 22, 2025: గ్రహణం మొర్రి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్మైల్ ట్రైన్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుడ్‌విల్ అంబాసిడర్‌గా సినీ నటి, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ పావని గంగిరెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించారు. ఈ భాగస్వామ్యంతో ప్రపంచవ్యాప్తంగా గ్రహణం మొర్రితో బాధపడుతున్న వ్యక్తులు, ఆయా కుటుంబాలకు ధైర్యం ఇవ్వడానికి స్మైల్ ట్రైన్ ప్రారంభించిన ప్రపంచ క్లెఫ్ట్ అవగాహనా దినోత్సవం (జూలై 20) సందర్భంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మైల్ ట్రైన్ ఇండియాతో చేతులు కలపడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. గ్రహణం మొర్రితో బాధపడుతున్న పిల్లలతో మాట్లాడితే మనస్సు చలించిపోయిందన్నారు. గ్రహణం మొర్రి చికిత్స శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, ఆత్మవిశ్వాసానికి ఎంతో అవసరమని తెలుస్తుందన్నారు. ఈ అంశంపై మరింత అవగాహన పెంచేందుకు నావంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా స్మైల్ ట్రైన్ ఆసియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, రీజినల్ డైరెక్టర్ మమతా క్యారల్ మాట్లాడుతూ పావనికి ప్రాంతీయంగా ఉన్న బలమైన అనుబంధం, ఆమెకు ఉన్న మానవీయ స్వభావం ఈ అంశంపై ప్రచారం చేయడంలో ఆమెను శక్తివంతమైన ప్రతినిధిగా నిలబెడతాయన్నారు. చికిత్స ఆలస్యమవడం వల్ల చాలా మంది తినడం, ఊపిరి పీల్చడం, మాట్లాడడం వంటి ప్రాథమిక విషయాల్లో ఇంకా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ ప్రచారం వల్ల నాణ్యమైన గ్రహణం మొర్రి చికిత్స ఉచితంగా అందుతోందన్న విషయం ఎన్నో కుటుంబాలకు చేరువవుతుందన్నారు. ఈ సందర్భంగా బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్లాస్టిక్ సర్జన్, స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ముఖుంద్ రెడ్డి మాట్లాడుతూ గ్రహణం మొర్రిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉ



ందన్నారు. స్మైల్ ట్రైన్ వేసిన ఈ అడుగు సమాజంలో చురుకైన భాగస్వామ్యం, ముందస్తు జోక్యం, తగిన చికిత్స వంటి అంశాల్లో కొత్త దారులు తెరుస్తుందన్నారు. పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తీసుకురావడం, సమయానికి చికిత్స అందడం వల్ల కలిగే మార్పులను ప్రచారం చేయనున్నామని చెప్పారు. తెలంగాణలో 27,000 మందికి పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 8,000 మందికి పైగా చిన్నారుల జీవితాలను స్మైల్ ట్రైన్ మార్చిందన్నారు. ఉచితంగా అందించిన గ్రహణం మొర్రి శస్త్రచికిత్స ద్వారా మార్గనిర్దేశం చేసిందన్నారు. ప్రతి రాష్ట్రంలో మూడు భాగస్వామ్య హాస్పిటల్స్ ద్వారా అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన ఆరోగ్య సేవల వ్యవస్థను నిర్మిస్తోందని తెలిపారు. ముందుగా పావని గంగిరెడ్డి స్మైల్ ట్రైన్ అందిస్తున్న గ్రహణం మొర్రి చికిత్స గురించి వివరంగా తెలుసుకున్నారు. ఉచితంగా ఈ చికిత్స పొందిన చిన్నారులు, ఆయా కుటుంబాలతో సన్నిహితంగా మాట్లాడారు. గుడ్‌విల్ అంబాసిడర్‌గా పావని గంగిరెడ్డి స్మైల్ ట్రైన్ ఇండియా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలలో పాల్గొంటారు. తల్లి-శిశు ఆరోగ్యం, గ్రహణం మొర్రి చికిత్సకు సంబంధించిన విభాగాల్లో అవగాహన పెంచేందుకు మద్దతు అందించనున్నారు.

# నల్లమల్ల ఫారెస్ట్ చెక్పోస్టుల వద్ద జర్నలిస్టులకు టోల్ టాక్స్ మినహాయించాలి

**-కలెక్టర్ జిల్లా ఫారెస్ట్ అధికారుల కు టి యు డబ్ల్యూ జె (ఐ జేయు) వినతి పత్రం**

నాగర్ కర్నూల్ జూలై 22(వుదయం ప్రతినిధి) జిల్లా లోని నల్లమల్ల ఫారెస్ట్ పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీశైలం రహదారి మన్ననూరు ,దోమల పెంట ప్రధాన చెక్పోస్టులతో పాటు అటవీ ప్రాంతంలో ఉన్న దర్శనీయ స్థలాల వద్ద ఏర్పాటుచేసిన ఫారెస్ట్ చెక్ పోస్ట్ ల వద్ద నాగర్ కర్నూల్ జిల్లా తో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా జర్నలిస్టులకు టోల్ టాక్స్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ టి యు డబ్ల్యూ జే (ఐజేయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు నాగర్ కర్నూల్ కలెక్టర్ భదావత్ సంతోష్ ,జిల్లా ఫారెస్ట్ అధికారి రోహిత్ గోపిడీలకు వినతిపత్రం అందజేశారు ఇటీవల జరిగిన టి యు డబ్ల్యూ జేబి ఐ జే యు నాల్గవ జిల్లా మహాసభలకు హాజరు కావలసిన కలెక్టర్ ఎస్పీ ఫారెస్ట్ జిల్లా అధికారులు కార్యక్రమానికి హాజరుకానందున నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీ, జిల్లా ఫారెస్ట్ అదికారులను శాలువాతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెక్ పోస్ట్ ల వద్ద టోల్ టాక్స్ మినహాయింపులకు సంబంధించి సానుకూల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పి విజయకుమార్, కార్యదర్శి సురేష్ కుమార్, సహాయ కార్యదర్శి పి యాదయ్య, ఈసీ మెంబర్లు ప్రసాద్, రమణ కుమార్ కొల్లాపూర్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్ గౌడ్ ,వెంకటస్వామి,





నాగర్ కర్నూల్ ఉపాధ్యక్షుడు జంగిటి రాంప్రకాష్ , పట్టణ అధ్యక్షుడు మల్లేష్ తోపాటు సీనియర్ రిపోర్టర్లు కందికొండ మోహన్, మాధవరెడ్డి, వినయ్ కుమార్ , తెలకపల్లి మండల శాఖ అధ్యక్షుడు చింత కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెలవారి నేర సమీక్ష సమావేశంలో

**-జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు**



గద్వాల జులై 22(వుదయం ప్రతినిధి) జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ హాల్ లో మంగళవారం జిల్లా ఎస్పీ టీ శ్రీనివాస్ రావు పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న భద్రత చర్యలు,పోలీస్ స్టేషన్ల వారిగా పెండింగ్లో ఉన్న కేసులు వాటి వివరాలు ప్రస్తుత స్థితిగతులు అడిగి తెలుసుకుని పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తుని చేపట్టి నేరస్తులకు శిక్షపడే విధంగా కృషి చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని,కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై, తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ లలో నమోదు అయినా కేసులలో కంటేస్టేడ్ కేసులను ఐడెంటిఫై చేసి తప్పనిసరిగా నిందితులకు శిక్షలు పడేలా చూడాలని, నమోదు అయినా కేసులలో అరెస్ట్ పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. యు ఐ (అండర్ ఇన్వెస్టిగేషన్)కేసులను త్వరగా చేధించాలని అన్నారు. కోర్టు డ్యూటీ అధికారులతో నిత్యం కాంటాక్ట్ లో ఉండి తరువాత రోజు జరుగబోయే కోర్ట్ ట్రాయల్స్ కేసులపై సమీక్షించుకోవాలని అన్నారు. పోక్సో, ఎస్ సి / ఎస్ టి కేసులలో నిర్ణిత సమయంలో ధర్యాప్తు పూర్తి చేసి కోర్టు లో ఛార్జి షీట్ వెయ్యాలని అన్నారు. పట్టణాల లో పోలీస్ అధికారులు ఎల్లపుడు అందుబాటులో ఉండి శాంతి భద్రతలను పర్యవేక్షిస్తూ ఉండాలని, రోజు వాహనాల తనిఖీలు చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్పీ మొగులయ్య, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, అలంపూర్, గద్వాల్, శాంతి నగర్, సి.ఐ లు రవి బాబు, శ్రీనివాస్, టాటా బాబు, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు, ఐటీ, ట్రాఫిక్ ఎస్ఐ లు పాల్గొన్నారు.

# సమన్వయంతో రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేద్దాం

**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

హనుమకొండ, జూలై 21(వుదయం జిల్లా ప్రతినిధి) : అధికారులందరు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధ్వర్యంలో మామూనూర్ పిటిసి వేదికగా త్వరలో జగరబోయే రెండవ రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణపై డ్యూటీ మీట్ పరిశీలన బృందంతో సభ్యులు, కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులతో వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం మామూనూర్ పిటిసిలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ముందుగా డ్యూటీ మీట్ పరిశీలకులు, పోలీస్ అధికారులతో కలసి పోటీలు నిర్వహిస్తున్న పిటిసిలో విభాగాల వారిగా పోటీలు నిర్వహించే ప్రదేశాలు ఆలాగే పోటీలకు రాష్ట్రం నలుమూలల నుండి పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో వస్తువుండడంతో వీరికి అవసరమైన మౌలిక సదుపాయల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రధానంగా ఈ పోటీలకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ అతిధ్యం ఇస్తుండడంతో పోటీల నిర్వహణకై డిసిపిలు, ఎసిపిలు స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించడంతో పాటు, వారు నిర్వర్తించాల్సింన కార్యకలపాలపై సంబంధిత కమిటీ ఇంచార్జ్ అధికారుల పాత్రపై పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఈ పోటీలకు సజావుగా నిర్వహించేందుకుగాను చేయాల్సిన ఏర్పాట్లపై న్యాయనిర్ణేతలు, పరిశీలన నిపుణులు పోలీస్ కమిషనర్‌కు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అతి పెద్దనగరంవైన వరంగల్ నగరంలో రెండవ డ్యూటీ మీట్



నిర్వహిస్తుండడంతో ఆనందంగా వుందని. ఈ పోటీల నిర్వహణకు నియమించిన కమిటీ సభ్యులు వారికి అప్పగించిన విధులను విజయవంతంగా పూర్తి చేయాలని, ఈ పోటీలకు సంబంధించి ఎలాంటి అనుమానాలు వున్నా తన దృష్టికి తీసుకరావాలని, పోటీలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అధికారులు ముందస్తూ ప్రణాళికతో పనిచేయాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, పిటిసి ప్రిన్సిపాల్ పూజ,సి.ఐ.డి ఎస్.పి రాంరెడ్డి, కమాండెంట్ రామకృష్ణ, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్,శ్రీనివాస్,ప్రభాకర్ రావుతో పాటు, వరంగల్ పోలీస్ కమిషనరేట్, సిఐడి, రాష్ట్ర సెక్యూరిటీ విభాగంకు చెందిన ఎసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు,ఆర్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# పింగిలి కళాశాలలో దాశరథి శత జయంతి వేడుకలు!

**-ప్రొఫెసర్ బి చంద్రమౌళి**

హనుమకొండ, జూలై 21(వుదయం జిల్లా ప్రతినిధి) : పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల, వడ్డేపల్లి, హనుమకొండ తెలుగు విభాగం ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి .చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి దాశరథికి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరుకు చెందిన కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య నిజాం రాజును ఎదిరిస్తూ రచనలు చేశారనీ, తెలంగాణ విముక్తి కోసం కృషి చేశారని, నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని సగర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించారని ఎన్నో సినిమా పాటలను రచించి, సాహితీ గౌరవం తీసుకొచ్చారని, ఇలాంటి గొప్ప కవులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు కూడా రచనలు చేయాలని ఆకాంక్షించారు. తెలుగు విభాగాధిపతి ఎస్.మధు మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్య జీవిత విశేషాలను, రచనల గూర్చి సమగ్రంగా తెలిపి, ప్రతి సంవత్సరం దాశరథి జయంతి సందర్భంగా



తెలంగాణ రాష్ట్రంలో సాహిత్యరంగంలో కృషిచేసినవారికి తెలంగాణ ప్రభుత్వం దాశరథి సాహిత్య పురస్కారం అందజేస్తోందని అన్నారు .కార్యక్రమంలో అధ్యాపకులు రామా రత్నమాల, ప్రొ .బి. సునీత, డా.రాజు, వైష్ణవి మరియు విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం నిర్వహించిన ఉపన్యాస పోటీలో శృతి, శ్రీవల్లి, పావని లకు ప్రిన్సిపాల్ బహుమతులు అందించారు.

# మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయండి

జయశంకర్ భూపాలపల్లి జూలై 22(వుదయం ప్రతినిధి) ఈనెల 25వ తేదీన మందకృష్ణ మాదిగ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పర్యటిస్తారని పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దమ్ము వెంకటేశ్వర్లు బెల్లంపల్లి సురేష్ పిలుపునిచ్చారు మంగళవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో వారు పాత్రికేయలతో మాట్లాడుతూ వికలాంగులకు 6000 పెన్షన్ తాత అవ్వలకు 4000 పెన్షన్ ఇవ్వాలని మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటంలో భాగంగా ఈనెల 25వ తేదీన భూపాలపల్లికు వస్తున్నారని ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టో ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు న్యాయం చేయడం లేదని ఆగస్టు 13 తేదీ లోపే వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే హైదరాబాదులో తాడోపేడో తెలుసుకోవడానికి మందకృష్ణ మాదిగ సిద్ధంగా ఉన్నారని వికలాంగులు సైతం అత్యధిక సంఖ్యలో పోరాటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు మహాదేవపూర్ మండలంలోని వికలాంగులు గ్రామలనుండి



తరలివచ్చి మందకృష్ణ మాదిగ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామచంద్రం, అంబాల చంద్రమౌళి వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు వీరగంటి సమ్మయ్య ప్రధాన కార్యదర్శి కన్నెబోయిన కొమరమ్మ .టౌన్ ప్రెసిడెంట్ మీర్జా ముస్తాక్ బేగ్, తదితరులు పాల్గొన్నారు

# రైతులు అధైర్య పడవద్దు..

## -ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోరుట్ల జూలై 22 (వుదయం ప్రతినిధి) కథలాపూర్ మండల కేంద్రంలో వరద కాలువ నీటి విడుదల విషయమై మంగళవారం జరిగిన ధర్నాను ఉద్దేశించి కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ ఇట్టి ఎస్సారెస్పీ వరద కాలువ నీటి విషయమై ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గం శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో ఎప్పటికప్పుడు మాట్లాడుతూనే ఉన్నామని రైతులకు అండగా నిలిచే ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు సంక్షేమం కొరకే పని చేస్తుందని అయితే ఈ వర్షాకాల సమయంలో 45-50 రోజుల వర్షాకాలం గడిచినా కానీ సరైన వర్షాపాతం లేనందున ప్రాజెక్టులలో లిఫ్టింగ్ రివర్స్ పంపినకు సరిపడా నీరు లేనందున ఎస్సారెస్పీ వరద కాలువకు నీటి విడుదల చేయడం వీలుపడలేదని శ్రీరామ్ సాగర్ అలాగే ఎల్లంపల్లి ప్రాజెక్టులలో నిబంధనల ప్రకారం రివర్స్ పంపినకు సరిపడా నీరు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని కాళేశ్వరం ప్రాజెక్టులో ఇన్ఫ్లో ఎంత వస్తే హార్ట్ లో కూడా అంతే వెళ్లాల్సిన పరిస్థితి లేదంటే పూర్తి ప్రాజెక్టుకే ప్రమాదకరమని కేంద్ర ప్రాజెక్టు రీసెర్చ్ బృందం ఇచ్చిన నివేదిక తెలిసిన విషయమే కాబట్టి శ్రీరాంసాగర్ 9 ఎల్లంపల్లి ప్రాజెక్టులలో ఆ మిగిలిన మూడు నుండి నాలుగు టీఎంసీల నీరు నిలువ అయినా మరుక్షణమే రైతు సంక్షేమం కొరకు విడుదల చేసే పూర్తి బాధ్యత ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ దేనిని రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ఆందోళన చెందవద్దని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రైతులకు తెలిపారని కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలియజేశారు

# ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆధ్వర్యంలో ఘనంగా జిఎం శాలెం రాజు జన్మదిన వేడుకలు.



భద్రాద్రి కొత్తగూడెం జులై 22 (వుదయం ప్రతినిధి) కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఏరియా రథసారథి శ్రీ శాలెం రాజు పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెం ఏరియా ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ ఆధ్వర్యంలో ఐఎన్టియుసి నాయకులతో కలిసి జి.ఎం కు పూల బొకే,శాలువాతో హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ జిఎం శతాధిక పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, ఆ దేవుని కృపతో కొత్తగూడెం ఏరియాను ఉత్పత్తి ఉత్పాదలో ముందు వరుసలో నిలబెడతారని ఆశిస్తూ, ఇంకా రానున్న రోజులలో సేఫ్టీ తో కూడిన ఉత్పత్తి తో కొత్తగూడెం ఏరియాని నెంబర్ వన్ స్థాయిలో నిలబెడతారని కోరుకుంటూ ఉద్యోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఐఎన్టియుసి ట్రేడ్ యూనియన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బూటిక రాజేశ్వరరావు, ఫిట్ కార్యదర్శులు గోపు కుమార్ స్వామి, ఎండి సత్తార్ పాష, సిహెచ్ సాగర్, మల్లికార్జున్, సెంట్రల్ మరియు బ్రాంచ్ సెక్రటరీ సకినాలు సమ్మయ్య, కాసర్ల సమ్మయ్య, సీతారామరాజు, కల్వల శ్రీనివాస్, వై రవి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హమీద్, వెంకటస్వామి, గుత్తుల నవీన్, పృథ్వీరాజ్, వేణు, ప్రవీణ్, మిత్రులు శ్రేయోభిలాషులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రిపోర్టర్ అని చెప్పుకుని తిరుగుతున్నా వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి కలెక్టర్ ఎస్పీ లకు ఫిర్యాదు



జయశంకర్ భూపాలపల్లి జులై 22(వుదయం ప్రతినిధి) యూట్యూబ్ ఛానల్ పేరుతో ప్రజలను అధికారులను బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతూ జర్నలిజం వృత్తికే విలువ లేకుండా చేస్తున్న రిపోర్టర్ అని చెప్పుకుని తిరిగే వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి కాకతీయ క్లబ్ జర్నలిస్టులు కోరారు మంగళవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ను వేరు వేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నివాసము ఉంటూ యూట్యూబ్ ఛానల్ పత్రిక పేరుతో ఇష్టారాజ్యంగా చలామణి అవుతు మరో పత్రికలో అక్రిడేషన్ కార్డు పొంది పని చేస్తున్నట్లు ఫిర్యాదులు చేశారు తాను నడిపిస్తున్న యూట్యూబ్ చానెల్ కు అనుమతులు హక్కులు లేవనీ ఫిర్యాదులో తెలిపారు సమాజంలో తాను జర్నలిస్టునని చెబుతూ బ్లాక్మెయిల్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు సదరు నకిలీ విలేకరి పైన పెద్దపెల్లి, భూపాలపల్లి, హుజురాబాద్ పోలీస్ స్టేషన్లో పలు కేసులు నమోదు తో పాటు భూపాలపల్లిలో రౌడీషీట్ కేసు ఉందని తెలిపారు. ప్రజలను అధికారులను బెదిరింపులకు పాల్పడుతూ జర్నలిస్టుగా చెలమని అవుతున్న నకిలీ విలేకరి అక్రిడేషన్ కార్డును రద్దు చేయాలని, ఆయనపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ప్రెస్ క్లబ్ కు చెందిన 80 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ వి, ఎస్, అచ్యుతానంద్ సంతాప సభ



జులై 22 దమ్మపేట, (వుదయం ప్రతినిధి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మంగళవారం నాడు సిపిఎం పార్టీ దమ్మపేట మండల కార్యాలయం సుందరయ్య భవనంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రావుల శోభన్ బాబు అధ్యక్షతన సిపిఎం పార్టీ అగ్ర నాయకులు కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు. కామ్రేడ్. వీ. ఎస్. అచ్యుతానందన్. సంతాప సభ జరిగింది తొలుత. అచ్యుతానందన్ చిత్రపటానికి. మాజీ జిల్లా కమిటీ సభ్యులు. దొడ్డాలక్ష్మీనారారణ. పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు తరువాత జరిగిన సంతాప సభలో దొడ్డాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ దివంగత నేత కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పార్టీ మాజీ పొలిటికల్ సభ్యులు అనారోగ్యంతో 101 సంవత్సరాలు జీవించి మృతి చెందారని సిపిఎం పార్టీ ఏర్పాటు లో ముఖ్యమైన వ్యక్తి చివరి వ్యక్తిగా మరణించారని పేదరికం అనుభవించి కార్మిక జీవితం గడిపి పేదల కోసం కష్టజీవుల కోసం జీవితమంతా ఎర్రజెండా ఎదుగుదల కోసం పనిచేశారని కార్మికుడిగా జీవితం ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగి కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2006 నుంచి 2011 వరకు పనిచేశారని పేదలకు భూములు పంచారని ఆదర్శనీయుడు గొప్ప విప్లవకారుడు అని ఘనంగా నివాళులర్పించారు ఇంకా ఈ కార్యక్రమంలో కొలికి పోగు శ్రీనివాసరావు. మురహరి రఘు, తంగెళ్ళమూడి రమేష్, కొలికి పోగు, సుమంత్. కవులూరి రామకృష్ణ. తోడెం పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# వెల్లుల్ల ఎల్లమ్మ హుండీ ఆదాయం 40329



మెట్ పల్లి జూలై 22 (వుదయం విలేఖరి) మెట్పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆదాయం మంగళవారం వివిధ సేవా టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయం 31 వేల 955 రూపాయలు అమ్మవారి హుండీ విప్పి లెక్కించగా 8374 రూపాయల ఆదాయం వచ్చింది వివిధ సేవా టికెట్లు హుండీ ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం 40 వేల 329 రూపాయల ఆదాయం వచ్చింది ఈ కార్యక్రమంలో వెల్లుల్ల గ్రామపంచాయతీ సెక్రటరీ సిహెచ్ నారాయణ వివిధ ఆలయాల దేవాదాయ శాఖ డిప్యూటేషన్ సిబ్బంది కల్వకుంట్ల అనిల్ రావు కూకట్ల రాజేందర్ గుంటుక కేశవ్ మేత నర్సయ్య లు పాల్గొన్నారు మెట్పల్లి పోలీస్ శాఖ వారు భక్తులకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం కోసం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ నిర్వహణ చేయడమైనదని దేవాలయ కార్యనిర్వాహణాధికారి కే కాంతారెడ్డి తెలిపారు

# రాజీవ్ గృహకల్పలో ఘనంగా తొట్టెలు ఊరేగింపు.



కుత్బుల్లాపూర్, జులై 22,(వుదయం ప్రతినిధి),తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిక అయిన బోనాల పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో జెఎస్ఆర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెలు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిధులుగా ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ పాల్గొని బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్ రెడ్డి, మేకల మధుసూదన్, వై ఎస్, యువ నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



జన్నారం, జులై 22(వుదయం విలేకరి) ఖానాపూర్ ఎమ్మెల్యే వేడుమ బొజ్జు పటేల్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, ఆదివాసి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. జీవో నెంబర్ 49ని రద్దు చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం రోజున ఉదయం కవ్వాల్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ జీవో రద్దు చేయడానికి కృషిచేసిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,ఆదివాసి ముద్దుబిడ్డ మంత్రి సీతక్క,జిల్లా మంత్రి వివేక్,మైనార్టీ గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు వారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మండాడి ననేశ్వర్,ఊర్వత దర్శు, పెంద్రం రాజేశ్వర్,ఆడయి మాణిక్ రావు, మండాడి జంగు, తొడసం గంగు, పేదోర్ బారికరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ ఖాన్ , ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు సయ్యద్ ఇషక్,లకావత్ నందు నాయక్, షాకీర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను అరెస్టు చేయడం సరికాదు



జన్నారం, జూలై 22(వుదయం విలేకరి) తెలంగాణ ఉద్యమకారులను అరెస్టు చేయడం సరికాదని జన్నారం మండలం తపాలాపూర్ గ్రామ ఉద్యమకారులు విజయ్ ధర్మ అన్నారు. మంగళవారం రోజున తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు చలో గన్ పార్క్ కు వెళ్లకుండా జన్నారం పోలీసులు ముందస్తుగా ఆయన ఇంటికి వెళ్లి ఉదయం అరెస్టు చేసి విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన కోరారు.

# ఎస్సైని సన్మానించిన ఆదివాసి నాయకులు



జన్నారం, జూలై 22(వుదయం విలేఖరి) జన్నారం నూతన ఎస్సై గొల్లపెల్లి అనూషను ఆదివాసి సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం రోజున ఆదివాసీ నాయిక్పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యలో వారు ఎస్ఐని మర్యాద పూర్వకంగా కలసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయిక్పోడ్ జిల్లా అధ్యక్షుడు మరినేని భూమేశ్, ఉపాధ్యక్షులు సాదం చిన్నయ్య,ప్రచార కార్యదర్శి ఆరే రాజశేఖర్, తిమ్మపూర్ ఆదివాసీ నాయిక్పోడ్ యూత్ అధ్యక్షుడు అశునూరి వెంగయ్య,ప్రధాన కార్యదర్శి పిట్టల పోసన్న,యూత్ సభ్యులు ఉన్నారు.

# వల్లంపల్లి కొనరావుపేట 33 కెవి పీడర్ల టవర్ల ఏర్పాటు పరిశీలన.

## -జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ సుదర్శనం.
## -మెట్పల్లి డివిజన్ పోలీస్ అధికారి రాములు



కోరుట్ల జూలై 22 (వుదయం ప్రతినిధి) తేదీ 22 7 2025 మంగళవారం జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ బి సుదర్శనం మెట్పల్లి పోలీస్ డివిజన్ అధికారి రాములు ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33 కెవి వల్లంపల్లి 33 కెవి కొనరావుపేట పీడర్ల టవర్ల ఏర్పాటును పరిశీలించి విద్యుత్తు ప్రమాద నివారణకు వినాయక విగ్రహా తయారీదారులకు సూచనలు చేసి ప్రతి ఒక్కరూ వారి షెడ్లలో వైరింగ్ తనిఖీ చేసుకోవాలని అలాగే విగ్రహాల తరలింపు సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు సుమారు 30 మంది నిర్వాహకులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు 11 మీటర్ల ఎత్తు గల 17 ఫోన్ లను ఏర్పాటు చేసినట్లు ఇందుకు విద్యుత్ శాఖ తరపున సుమారు 20 లక్షల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో డి ఈ టెక్నికల్ గంగారం ఏ డి ఈ కోరుట్ల రఘుపతి ఏఈలు విద్యుత్ శాఖ సిబ్బంది వినాయక విగ్రహాల తయారీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# జీవో 49 రద్దు పై హర్షం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆదివాసి నాయకులు



కాసిపేట జులై 22 (వుదయం విలేకరి) కన్జర్వేషన్ కారిడార్' ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయగా జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆదివాసీ నాయకులు ధన్యవాదాలు తెలుపుతూ కాసిపేట మండలంలోని దేవాపూర్ లో కుంరం భీం చౌరస్తా వద్ద ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . జీవో 49 ద్వారా కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 3 లక్షల ఎకరాల అటవీ భూమిని కన్జర్వేషన్ ఫారెస్ట్ కారిడార్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కన్జర్వేషన్ కారిడార్ వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది ఈ కార్యక్రమంలో మడావి వెంకటేష్ కాసిపేట మండల ఆదివాసీ సేన అధ్యక్షుడు మడావి గంగారం ఆదివాసీ సేన గౌరవ అధ్యక్షుడు కుంరం. జనార్ధన్ సలహాదారుడు వల్క. చిలకయ్య తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం .మహేష్ కొలం సంఘం జిల్లా అధ్యక్షుడు జూగ్నుక. అచ్యుత్ రావు పటేల్ ఆత్రం. అచ్యుత్ రావు పటేల్ కృష్ణారావు తదితులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ గెలుపు..

## -మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



రాయపర్తి జులై 22 ( వుదయం ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ కార్యకర్తలు సైనికులు లాగా పనిచేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో కుందూరు అమరేందర్ రెడ్డి దొడ్డి ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు మనవత్ నరసింహ నాయక్ అధ్యక్షత ఎంపీటీసీల క్లస్టర్ వారిగా మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. అనంతరం కేశవపురం ఎంపిటిసి పరిధి జింక్ రామ్ తండా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ బానోతు శ్వేత సుభాస్, బీమా మాలోత్ రవి బోజ లక్ష్మణ్ లు కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి మాజి మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచ్లు గారే నర్సయ్య, కందికట్ల స్వామి, భూక్యా బద్రు నాయక్, సుందర్ నాయక్, కర్రె రవీందర్ రెడ్డి, గాదే రవీందర్ రెడ్డి, చిన్నాల రాజబాబు, గజ్జవల్లి ప్రసాద్ మండల నాయకులు ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్ల స్వామి, చందు సతీష్ , ఎండి యూసుఫ్ , సిల్వేరు సాయి ,ఎంపీటీసీల క్లస్టర్ ఇన్చార్జీలు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుమ్మర్ల శ్రావణ మాసం తొలి బోనాల జాతరను విజయవంతం చేయాలి

## -తెలంగాణ కుమ్మరి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి సతీష్
## -బోనాల జాతర ఉత్సవ నియోజకవర్గ కో కన్వీనర్ తాడూరి చంద్రం
## -శ్రీ భవాని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల



చిట్యాల జులై 22(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 27వ తారీఖున కనగల్ మండలం ధర్వేశిపురం శ్రీ ఎల్లమ్మ దేవాలయం లో నిర్వహించే "కుమ్మర్ల శ్రావణమాసం తొలి బోనాల జాతర" కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు కంబంపాటి సతీష్, బోనాల జాతర ఉత్సవ కమిటీ నకిరేకల్ నియోజకవర్గ కో కన్వీనర్ తాడూరి చంద్రం అన్నారు. మంగళవారం చిట్యాల శ్రీ భవాని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మర్ల శ్రావణమాసం తొలి బోనాల జాతర చైర్మన్ ఏడుకొండల సత్యవతి వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి కుమ్మర్లు అంతా ఐక్యమతంతో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవాని కుమ్మర సంఘం అధ్యక్షుడు ఆరూరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి రథారపు గిరి, కోశాధికారి ఖమ్మంపాటి మల్లేష్, గౌరవ సలహాదారులు బొడ్డుపల్లి చంద్రశేఖర్, కంభంపాటి నరసింహ, నరుకూరి ఊసయ్య, కొలనుచెలిమి శంకరయ్య కుల సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

-కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు
-బ్యాంకు లింకేజ్ ద్వారా 157 స్వయం సహాయక సంఘాలకు 18 కోట్ల 27 లక్షలు
-వడ్డీ లేని రుణాలు 2100 స్వయం సహాయ సంఘాలకు రెండు కోట్ల 36 లక్షలు.
-లోన్ బీమా ఈ పథకం ద్వారా 7 కి 5,90, 448 రూపాయలు.
-ప్రమాద భీమ పథకం క్రింద -01 కి 10,00,000 రూపాయలు.



భద్రాద్రి కొత్తగూడెం జూలై 22 (వుదయం ప్రతినిధి ):మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్ నందు ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్సును వారు తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ముందుగా జ్యోతి ప్రజ్వలం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని మహిళా సంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహకాల గురించిన ప్రగతి నివేదికలను సభకు వివరించారు. అనంతరం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. దీనిలో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళల సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సుల నిర్వహణ, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పలు మహిళా అభ్యున్నతి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. గత పది సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు పంపిణీ జరగలేదని, ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డుల సవరణలు చేరికలు కూడా చేపట్టారన్నారు. ఈనెల 25 నుంచి 10 వ తారీకు వరకు ప్రతి మండల కేంద్రంలో రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తుగా నిర్వహించనున్నట్లుగా ఆయన తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగపరచుకోవాలని, తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడంతో పాటు కుటుంబాలు అభివృద్ధి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మహిళల శక్తిని గుర్తించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి, లక్ష్మీదేవి పల్లి, సుజాతనగర్ పాల్వంచ మండలాల్లో మొత్తం 2984 మహిళా సంఘాల లో 29,801 సంఘ సభ్యులు ఉండగా బ్యాంకు లింకేజ్ ద్వారా 157 స్వయం సహాయక సంఘాలకు 18 కోట్ల 27 లక్షలు.వడ్డీ లేని రుణాలు 2100 స్వయం సహాయ సంఘాలకు రెండు కోట్ల 36 లక్షలు.లోన్ బీమా ఈ పథకం ద్వారా 7 కి 5,90, 448 రూపాయలు.ప్రమాద భీమ పథకం క్రింద -01 కి 10,00,000 రూపాయలు.మహాలక్ష్మి పథకం ద్వారా పాల్వంచ మండలంలో ఒక బస్సుకు 69,468 రూపాయల చెక్కులను శాసనసభ్యుని చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, డీఎస్ఓ రుక్మిణి, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, తాసిల్దార్ లు కొత్తగూడెం పాల్వంచ సుజాతనగర్ చుంచుపల్లి లక్ష్మీదేవిపల్లి, మహిళా సంఘాలు సభ్యులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వంలో పెను మార్పులు.

-పేద ప్రజలకు ఉపయోగపడే ప్రతి పథకాన్ని అమలు చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.
-ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
-మేడిపల్లి మోడల్ స్కూల్ లో కిచెన్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్
-ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభించిన ప్రభుత్వ విప్





కోరుట్ల జూలై 22 (వుదయం ప్రతినిధి) విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వంలో పెను మార్పులు తీసుకువస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు మంగళవారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మేడిపల్లి మండలంలో పర్యటించారు మేడిపల్లి మండలం పోరుమల్ల కట్లకుంట వల్లంపల్లి మాచాపూర్ గ్రామాల్లో 60 లక్షలతో నూతన అంగన్వాడి భవనాలకు శంకుస్థాపన మాచాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు మేడిపల్లి మోడల్ స్కూల్ లో 10 లక్షలతో నిర్మిస్తున్న కిచన్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మేడిపల్లి మండలానికి అనేక అంగన్వాడి భవనాలను భవనలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు ప్రజా ప్రభుత్వంలో పేద వారికి ఉన్నత విద్యా అందించడానికి చిన్న తనంలోనే చిన్నారులకు పౌష్టిక ఆహారం అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు గురుకులంలో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన విద్య ఆహారం ఆందజేస్తున్నట్లు అందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యార్థులకు ఒకే రకమైన మెనూ ప్రకారం భోజనం అందజేయడం జరుగుతుందని తెలిపారు ప్రజా ప్రభుత్వంలో కాస్మోటిక్ డైట్ చార్జీలను పెంచడం జరిగిందని తెలిపారు గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని అమలు చేశారని తద్వారా ఈ పథకం వలన ఎంతో మంది ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్య విధానంలో పెను మార్పులు చేస్తున్నారని ఐటిఐ లను ఏటీసి లు మార్పు చేస్తున్నారని 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్కిల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే మళ్ళీ ఇందిరమ్మ రాజ్యంలో పదకొండు సంవత్సరాలు తర్వాత డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టుల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు మేడిపల్లి మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు అయోధ్య పోరుమల్ల గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం చేపడతానని ఎన్నికల్లో హామీ ఇచ్చి మీ బిడ్డ గెలిచిన తర్వాత రోడ్డు మంజూరు చేయడం జరిగిందని రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నయని తెలిపారు మోడల్ స్కూల్ సందర్శన. మేడిపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ను రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సందర్శించారు 10 లక్షలతో నిర్మిస్తున్న కిచన్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు అనంతరం విద్యార్థిని విద్యార్థుల కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వారితో కలసి భోజనం చేశారు విద్యార్థి జీవితం ఎంతో ఉన్నత మైనదని ఈ రోజులు మళ్లీ జీవితంలో రావని తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు అధికారులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కామిక ఏకాదశి రోజున వికాస తరంగిణి వారి శ్రీ విష్ణు పారాయణం.

-స్వామి వారి సేవలో తరించండి ఆధ్యాత్మికతను అలవర్చుకోండి మల్యాల వినయ్ కుమార్ గుప్తా.



నర్సంపేట జులై22 (వుదయం ప్రతినిధి) నర్సంపేట పట్టణంలోని మల్యాల కిరణ్మయి వినయ్ కుమార్ గుప్తా గృహమునందు. 21.7. 2025 సోమవారం సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు దంపతుల గృహములో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామి వారి మంగళశాషనాలతో శ్రీ లక్ష్మీ అష్టోత్తర విష్ణు సహస్రనామ పారాయణం కామిక ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వికాస తరంగిణి నర్సంపేట శాఖ మహిళలు సభ్యుల మధ్య నర్సంపేట నడి బొడ్డున ప్రధాన రహదారి పక్కన వారి గృహం నందు పారాయణం మరియు స్వామివారి ఆశీస్సులతో ఘనంగా నిర్వహించినారు. ఇట్టి ఆధ్యాత్మిక వేడుకలో అధ్యక్షులు కృష్ణా రావు మాట్లాడుతూ ప్రతి హిందువు ఆధ్యాత్మిక భక్తి ఉద్యమంలో పాల్గొనాలని ఇంటింట భక్తితో దైవ పారాయణం వల్ల మనస్సు శాంతియుతంగా ఉంటుందని చెప్పారు. కార్యదర్శి రంగనాథ స్వామి మాట్లాడుతూ ఉపవాసం ఆషాఢ మాసములో కృష్ణ పక్ష ఏకాదశిని కామిక ఏకాదశిగా జరుపుకుంటారు. ఈ ఏకాదశి సమయంలో మనసులో మనం ఏదైనా కోరికలు కోరుకుంటే కచ్చితంగా నెరవేరుతాయని చాలా మంది నమ్ముతారు. ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండటం వల్ల తాము చేసిన పాపాల నుండి విముక్తి లభిస్తుందని భావిస్తారు. కామిక ఏకాదశి రోజు పాలు ఇచ్చే గోవును, దూడ మరియు గ్రాసములతో కలిపి దానం చేయటం వలన సమస్త దేవతల ఆశీర్వాదం పొందుతారని తాము చేసిన పాపాల నుండి విముక్తి లభిస్తుందని భావిస్తారు. కామిక ఏకాదశి రోజు పాలు ఇచ్చే గోవును, దూడ మరియు గ్రాసములతో కలిపి దానం చేయటం వలన సమస్త దేవతల ఆశీర్వాదం పొందుతారు. లేత తులసి దళములతో చేసే శ్రీమన్నారాయణుని ఆరాధన గత జన్మ పాపాలను కూడా తొలగించివేస్తుంది. కామిక ఏకాదశి రోజున తులసి మొక్కను ఆరాధిస్తే కూడా పాపములు తొలగిపోతాయని చెప్పారు. ఆతిద్యం ఇచ్చిన మల్యాల కిరణ్మయి వినయ్ దంపతులకు మరియు వచ్చిన అందరికి మంగళశశానాలు తెలిపి తీర్ధ ఘోస్టి తొ కార్యక్రమం సుసంపన్నం చేసినారు. మహిళలు ఒకరికొకరు కుంకుమ బొట్టు పలకరింపు చేసుకున్నారు. సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు. ఒక ముఖ్య విశేషం ఇట్టి ఆధ్యాత్మ ఆతిద్య గృహం ముందు ఆవు లేగ దూడ ఓ 4 గంటలపాటు వచ్చి సేద తీరి గ్రాసం తీసుకున్నాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి కి అల్లికలతో తులసిమాల చూడతగ్గ దైవ రూపం పారాయణం ఆధ్యాత్మ ఘనంగా పరిపూరణమ్ మంగళషాషనాలు తీర్థ ఘోస్టి ప్రసాదం ఓ బఠాసారి తల్లి చిన్నారి ప్రథమంగా ప్రసాదం స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఆధ్యాశీతం శుభసూచికలు త్రికరణ శుద్ధితొ ఏ కార్యమైన దిగ్విజయం గా జరుగుతుందని తెలిపారు.

# నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు



జయశంకర్ భూపాలపల్లి జులై 22(వుదయం ప్రతినిధి) మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ప్రజల సైంటిస్టు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం పదవ వర్ధంతిని పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లాలోని ఎనిమిదవ తరగతి చదువుతున్న అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు భూపాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ ఉపాధ్యాయుడు కుసుమ కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు ఈ కార్యక్రమానికి భూపాలపల్లి మండల విద్యాశాఖ అధికారి అజ్మీర దేవా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భూగోళము వాతావరణ పరిస్థితులు మానవ నివాసయోగ్యం లేకుండా పెను మార్పులకు గురవుతున్నదని విద్యార్థులు ప్రతి ఒక్కరు సేంద్రియ విధానంలో వ్యవసాయం ఎలా చేయాలి, ప్లాస్టిక్ ని పూర్తిగా నిర్మూలించడానికి తగు చర్యలు తీసుకునే విధంగా తల్లిదండ్రులను మీరు చదివిన విషయాలను తెలియజేయాలని తెలిపారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా ప్రతి ఇంట్లో రెండు చెట్లు నాటి వాతావరణ సమతుల్యతను కాపాడాలని, కర్బన ఉద్గారాలను తగ్గించే విధంగా కృషి చేయాలని, సౌర విద్యుత్తును తయారీలో విద్యార్థులు పోటీ పడాలని, కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రభుత్వ రవాణా సాధనాలను వినియోగించుకోవాలని అన్నారు. ప్రజలు ఐక్యంగా ఉండాలని సామాజికంగా ఆర్థికంగా బలంగా ఉండాలని ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలను గుర్తెరిగి దేశాభివృద్ధికి పాటుపడాలని లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ కుసుమ కృష్ణమోహన్ ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం బహుమతులు పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రథమ బహుమతి మహమ్మద్ ఉమ్మెయుజుమ్మా సన్ వ్యాలి హై స్కూల్ భూపాలపల్లి ద్వితీయ బహుమతి జే. ప్రశాంత మాధురిమ బాలాజీ ఇంటిగ్రేటెడ్ పాఠశాల భూపాలపల్లి తృతీయ బహుమతి బి రియా మన్విత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపాలపల్లి విజేతలైన విద్యార్థులకు డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి ఈ నెల 27వాతేదీ, ఆదివారం బాలవికాస, ఫాతిమా నగర్, కాజీపేట లో జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు బహుమతులు తెలంగాణ రాష్ట్ర మంత్రులు, కలెక్టర్లు, అతిధులచే అందజేయబడతాయని , భూపాలపల్లి జిల్లా లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ సమన్వయకర్త కుసుమ కృష్ణమోహన్ ప్రకటన లో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు,

# విధులకు హాజరుకాని ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



జయశంకర్ భూపాలపల్లి జులై 22(వుదయం ప్రతినిధి) విధులకు హాజరుకానీ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ డిమాండ్ చేస్తూ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహాదేపూర్ మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్ లో విధులు నిర్వహిస్తున్న ఆంగ్లం బోధించే ఉపాధ్యాయుడు గత నెల రోజులుగా విధులకు హాజరు కావడంలేదని ఆరోపించారు ఈ విషయంపై పాఠశాల హెడ్మాస్టర్ ను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వివరణ అడగగా నెలరోజులుగా పాఠశాలకు రావడం లేదేని ఈ విషయం ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామని సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు విధులపై నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయుడిపై సంబంధిత శాఖ ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకొని ఉన్నత విద్యా అందించేందుకు వేల కోట్ల రూపాయలను ఖర్చు పెడుతూ నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుంటే ఉపాధ్యాయులు విధులకు హాజరు కాకపోవడంతో ప్రభుత్వ ఆశయాలు నీరుగారి పోతాయని అన్నారు ఉన్నతాధికారులు మహాదేవపూర్ పాఠశాలలపై దృష్టి సారించి విధులకు హాజరు కాని ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మహాదేవపూర్ ఇన్చార్జ్ ఎంఈఓ ను వుదయం ప్రతినిధి వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.?

# బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

-గోదావరిలో తెలంగాణ వాటను వదులుకునే ప్రసక్తే లేదు
-బీఆరెస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్



బెల్లంపల్లి, జులై22 (వుదయం ప్రతినిధి) చంద్రబాబుతో చీకటి ఒప్పందం చేసుకున్నా రేవంత్ రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రవణ్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బడికల శ్రావణ్ మాట్లాడుతూ. చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల ద్రోహాన్ని బద్దలు కొట్టి ఆంధ్రప్రదేశ్ జలదోపిడిని అడ్డుకొని తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్ట్ వలన తెలంగాణకు జరిగే అన్యాయాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను రాయలసీమకు తరలించడం కోసం ఏపీ నిర్మించ తలపెట్టిన అక్రమ ప్రాజెక్టే పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టు పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుత్తు తెలంగాణ రాష్ట్ర నీళ్లను ఆంధ్ర కు దోచిపెట్టడానికి సిద్ధంగా ఉన్న రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందాలకు చరమగీతం పాడాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం దుర్మార్గం. ఇంత వరకు స్కాలర్షిప్లు ఇవ్వలేదు. విద్యార్థులకు ఇస్తామన్న ఐదు లక్షల విద్య భరోసా కార్డు ఇవ్వలేదు. విద్యార్థినిలకు స్కూటీలు ఇవ్వలేదు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారని విమర్శించారు.అదేవిధంగా ఎస్సీ ఎస్టీ విద్యార్థులు పది పాస్ అయితే 10 వేలు, ఇంటర్మీడియట్ పాస్ అయితే 15 వేలు, డిగ్రీ పాస్ అయితే 25 వేలు , పీజీ పాస్ అయితే లక్ష, ఎం ఫీల్, పిహెచ్డి పూర్తిచేస్తే 5 లక్షల రూపాయలు ఇస్తాను ఘోరంగా మోసం 6 గారంటీలకు, 420 హామీలకు తూట్లు పొడిచి ఈనాడు రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మరియు బిజెపి ప్రభుత్వంతో అంటకాగుతూ పదవిని కాపాడుకుంటున్నటువంటి మోసకారి అని ఆరోపించారు అన్నారు. తక్షణమే గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ..లేని పక్షంలో భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ లక్షల మంది విద్యార్థులతో రేవంత్ ప్రభుత్వంను ముట్టడిస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్వి బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు అడెపు అరుణ్ కార్యదర్శి బుద్ధర్తి సుమంత్, సీనియర్ నాయకులు మురుకురి శ్రావణ్, దార రోషన్,అజయ్, విష్ణు,సాయి కిరణ్,సంతోష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామ్రేడ్ వి.ఎస్ అచ్యుతానందన్ కు ఘన నివాళులు.



కుత్బుల్లాపూర్, జులై 22,(వుదయం ప్రతినిధి),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ సుందరయ్య భవన్ లో కేరళ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ వి ఎస్ అచ్యుతానందన్ మృతికి సిపిఎం బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మేడ్చల్ జిల్లా నాయకులు, బాచుపల్లి మండల సిపిఎం కార్యదర్శి కామ్రేడ్ బి వెంకటరామయ్య మాట్లాడుతూ కామ్రేడ్ అచ్యుతానందన్ కేరళలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని కామ్రేడ్ వి ఎస్ 17 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరి సుమారు ఎనిమిదిన్నర దశాబ్దాల పాటు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి పార్టీలో కీలకమైన అనేక బాధ్యతలను నిర్వహించి సిపిఎం పార్టీ అగ్రస్థాయి నాయకులుగా, పోలిట్ బ్యూరో సభ్యులుగా సమర్థతకు మారుపేరుగా కార్యదక్షుడిగా నిల్చారన్నారు. కుట్టనాడ్ భూస్వాముల చేతుల్లో భయంకరమైన దోపిడికి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య ఉంటూ వారితో కలిసి పనిచేసే బాధ్యతలను పార్టీ నాయకులు కృష్ణ పిళ్ళై అప్పగించారు. ట్రావెన్కోర్ దివాన్ కు వ్యతిరేకంగా పున్నాప్ర వాయిలర్ తిరుగుబాటు సమయంలో వి ఎస్ అజ్ఞాతవాసంలోకి వెళ్లాల్సి వచ్చిందని, తరువాత అరెస్టు అయి కస్టడీలో తీవ్ర వేధింపులను ఎదుర్కొన్నారని 1980 నుంచి 1991 వరకు సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పని చేశారు. కేరళ అసెంబ్లీకి 7 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండు పర్యాయాలు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారని 2006 నుండి 2011 వరకూ కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టపరమైన పాలనాపరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. ఆయన మృతి పార్టీకి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని వారి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంతోష్ మండల నాయకులు ఎం. చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, నాయకులు అక్బర్ మల్లేష్ రవి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సన్నం బియ్యం ఇచ్చే ఏకైక రాష్ట్రం

**-రేషన్ కార్డుల జారీ ప్రజా పాలన పటిమకు నిదర్శనం**



పెద్దపల్లి జిల్లా: జూలై 22 (వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో ప్రజల అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుంటూ పౌర సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పెద్దపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా 4,847 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేసింది. ఈ కార్యక్రమం సోమవారం పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్స్ లో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొని కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డుల జారీపై ఎలాంటి చిత్తశుద్ధి లేనని, దరఖాస్తులు చేసిన ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి నలిగి పోయారే తప్ప ఒక్కరికి కూడా కార్డులు మంజూరు కాలేదన్నారు. కాగా, ప్రస్తుతం ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక అర్హతల ఆధారంగా కార్డులు మంజూరు చేస్తూ 24,770 మందికి నేరుగా లబ్ధి కల్పించిందని తెలిపారు. ఇదిలా ఉండగా, ఇప్పటికే ఉన్న కార్డుల్లో కొత్తగా 10,715 మందిని సభ్యులుగా చేర్చినట్లు చెప్పారు. మొత్తం కలిపితే నియోజకవర్గవ్యాప్తంగా 35,485 మందికి లబ్ధి చేకూరిందని వివరించారు. ఇంకా 3,289 రేషన్ కార్డు దరఖాస్తులు త్వరలో మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కార్డుల జారీ ఒక నిరంతర ప్రక్రియ అని వెల్లడించిన ఎమ్మెల్యే, కారు లేదా ట్రాక్టర్ ఉండటమే ఆధారంగా కార్డు తిరస్కరించవద్దని, వారి వాస్తవిక ఆర్థిక స్థితిని పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, బీఆర్ఎస్ పాలనలో ఎన్నికల సమయంలో మాత్రమే సంక్షేమ పథకాలు అమలవుతాయని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో స్వర్గీయ ఎన్టీ రామారావు 2 రూపాయల బియ్యం పథకాన్ని ప్రారంభించగా, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం మాత్రమే దేశంలో సన్నం బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రంగా నిలిచిందన్నారు. దీనికి శ్రేయస్సు రేవంత్ రెడ్డీ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వానిదని వివరించారు. మరోవైపు, యూపీఏ హయాంలో ప్రారంభమైన ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ పథకాలను మోడీ ప్రభుత్వంలో క్రమంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. బడుగు బలహీన వర్గాలకు లబ్ధి చేకూరాలంటే మళ్లీ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే కేంద్రంలోని అన్యాయ విధానాలకు ముగింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డిఎస్ఓ, వివిధ మండలాల తహశీల్దార్లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు మోడల్ స్కూల్ సందర్శన.

**-ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**





కోరుట్ల జూలై 22 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం కల్లూరు మోడల్ స్కూల్ ను మంగళవారం కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సందర్శించి వివిధ సమస్యలపై ఆరా తీశారు సంబంధిత సమస్యలపై అధికారులతో మాట్లాడారు స్కూల్లో విద్యార్థిని విద్యార్థుల బాగోగులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

అనంతరం స్కూల్లో డిజిటల్ పాఠ్యాంశాల తీరును విద్యార్థులతో కలిసి పాఠాలను విన్నారు పాఠశాలకు ఒక బస్సు నడుస్తుందని విద్యార్థినులు వివరించగా ఆర్టీసీ డిపో మేనేజర్ తో మాట్లాడి పాఠశాల సమయాన్ని బట్టి మరో బస్సు నడపాలని తెలిపారు స్కూల్లో ఎలక్ట్రికల్ సమస్య ఉన్నందున ఎలక్ట్రిసిటీ ఏ డి తో మాట్లాడారు హాస్టల్లో వాటర్ టాయిలెట్ సమస్య ఉన్నదని విద్యార్థినులు వివరించగా స్పెషల్ ఆఫీసర్ రజిత తో మాట్లాడి విద్యార్థుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ కోరుట్ల మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ కల్లూరు మాజీ సర్పంచ్ అంజయ్య మాజీ ఉపసర్పంచ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# పిఆర్టియు టిఎస్ ఉపాధ్యాయ సభ్యత్వ నమోదులో పింగళి శ్రీపాల్ రెడ్డి

తుంగతుర్తి /శాలిగౌరారం, జూలై 22, (వుదయం ప్రతినిధి): పిఆర్టియు టిఎస్ ఉపాధ్యాయ సంఘ బలోపేతంలో భాగంగా సభ్యత నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం రోజు నల్గొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ స్కూళ్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శాలిగౌరారం మండల అధ్యక్షుడు పున్న శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి గుత్తా ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం ,వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి హాజరయ్యారు. వల్లాల మోడల్ స్కూల్లో నమోదు కోసం వెళ్లిన ఎమ్మెల్సీకి పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తో పాటు ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించేందుకు ప్రయత్నం చేస్తానని, నోషనల్ ఇంక్రిమెంట్, పదోన్నతులు పొందే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మేకల జాన్ రెడ్డి, సుంకరి భిక్షం



గౌడ్,కాళం నారాయణ రెడ్డి తోపాటు వల్లాల ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు కుక్కడపు శ్రీనివాసు, సంధ్యారాణి, దామెర్ల కృష్ణయ్య, కేతేపల్లి శ్రీను, చంద్రశేఖర్ శ్రీరాములు,సంధ్య, సంగీత, సృజన, అనురాధ, మల్లేష్ ,జేబున్నీస, రవి,రాధ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక పై అత్యాచారం కేసులలో నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష.


**-2000 రూపాయల జరిమానా.**
**-బాధిత మైనర్ బాలికకు 2 లక్షల రూపాయలు పరిహారం.**
**-కీలక తీర్పును వెలువరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి రత్న పద్మావతి**
**-నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరు.**
**-జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్**

మెట్ పల్లి జూలై 22 (వుదయం విలేఖరి) మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిదికి చెందిన మైనర్ బాలికను నిందితుడు మర్రిపెల్లి సాయినాథ్ (24) అనే వ్యక్తి అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిపై ఫోక్సో చట్టం కింద తేదీ 7 4 2021న మల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది ఈ యొక్క కేసును దర్యాప్తు చేసిన ఇన్స్పెక్టర్ శ్రీను ఎస్ఐ రవీందర్ లు కోర్టుకి ఆధారాలు సమర్పించగా పిపి కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షలను ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన న్యాయమూర్తి రత్న పద్మావతి (డిస్టిక్ అండ్ సీనియర్ జడ్జ్ స్పెషల్ స్పెషల్ జడ్జ్ ఫోక్సో కేస్) మంగళవారం నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష 2 వేల రూపాయల జరిమాన విధించారు బాధిత మైనర్ బాలికలకు 2 లక్షల రూపాయలు పరిహారం ప్రకటిస్తూ తీర్పునిచ్చారు ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని పోలిసులు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు పై కేస్ లో నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన స్పెషల్ పీపీ రామకృష్ణ రావు ఇన్స్పెక్టర్ శ్రీను ఎస్ఐ రవీందర్ సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్ కోర్ట్ కానిస్టేబుల్ రంజిత్ సిఎంఎస్ కానిస్టేబుల్స్ రాజు శ్రీధర్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు

# శతజయంతి శతాంజలీ

**-డాక్టర్ అశోక్ పరికిపండ్ల**

నాతెలంగాణ ప్రజల కోటి రతనాల హృదయ తంతులను మీటి దోపిడీ పాలనపై అలుపెరుగని పోరు సలిపిన ఉద్యమకారుడు అన్యాయంపై అక్షర శస్త్రాలను ఎక్కుపెట్టిన విలుకాడు నిజాం భూస్వామ్య పాలనపై నిప్పులు చెరిగిన అగ్నిధార నా పేరు ప్రజా కోటి నా ఊరు ప్రజావాటి అంటూ భూమికోసం భుక్తి కోసం బానిసత్వ విముక్తి కోసం నిజాంపై పోరాడిన అక్షరయోధుడు ప్రదాయ, గేయ, ప్రణయ, ప్రళయ కవిత్వంతో అక్షర నక్షత్రాల సృష్టి కర్త తెలుగు సంస్కృతి వారసుడు ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి.. సామాజిక వైద్యులు చిత్ర పరిశ్రమ లలిత గేయాల కీర్తిశిఖరుడు అగ్ని ధార రుద్రవీణ తో మహా బోధిగా ఆలోచనలోచనాలతో తిమిరంతో సమరం చేసి ప్రతి వారి కంటిపాపలో నిలిచిపోయిన కవితా పుష్పకం పునర్నవంతో వాగ్దానం చేసిన మహా0ద్రోదయం, నిజాం నిరంకుశ పాలనపై నిప్పుల అగ్ని ధార కురిపించిన. కవితాచార్యులు. దాశరథి కృష్ణమాచార్యులు. మీకు శతాంజలులు.



# రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవు

**-ఆగస్టు 15 నాటికి వీలైనన్ని భూ సమస్యలుపరిష్కరించాలి**
**-ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏసమస్య రాకూడదు**
**-లబ్దిదారులకు దగ్గరలోని ఉచిత ఇసుక ఇవ్వాలి**
**-జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా**
**-రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హనుమకొండ, జులై 22(వుదయం జిల్లా ప్రతినిధి) : తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదే నని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసినప్పుడే దాని ఫలితాలు సామాన్యులకు అందుతాయని అన్నారు. మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సామాన్యులను ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని సస్పెండ్ చేయడానికైనా నుకాడబోమని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం ఉందని ఇది పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో 8.65లక్షల దరఖాస్తులు వచ్చాయని ఇందులో ప్రధానంగా సాదాబైనామా, సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్ , అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్ కు సంబంధించి సుమారు 6 లక్షల దరఖాస్తులు వచ్చాయని వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్ట 15వ తేదీలోగా వీలైనన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్దం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్దిదారుల వివరాలను ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు. దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టం వచ్చిన రీతిలో తిరస్కరించకూడదని, తిరస్కారానికి గల కారణాలను లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్దాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిపీవోలకు , జె ఎన్ టి యు ఆధ్వర్యంలో లైసెన్స్ డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేసుకొని పకడ్బందీగాపరీక్ష నిర్వహించాలన్నారు. ఇంటి నిర్మాణంలో పేదవాడికి ఏ సమస్య రాకూడదు పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ధరలు, చెల్లింపులు, ఇసుక, సిమ్మెంట్, స్టీల్ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏ సమస్య రాకుండా చూడాలని అలాగే ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని , ఇది సరైన విధంగా లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలో ఇసుక అందేవిధంగా చూడాలన్నారు. బేస్‌మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబాటులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్దిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్య కాదని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కలెక్టర్లు, సి. పి, ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్ధికంగా ఎన్ని ఇబ్బందులున్నాకూడా ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని అయితే సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించి లబ్దిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. 2 బిహెచ్‌కే ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైనలబ్దిదారులకు కేటాయించాలన్నారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించు కోవాలని మంత్రులు స్పష్టం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం సరఫరా. ముఖ్యమంత్రి ఆదేశాల కనుగుణం సాంఘిక, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమారులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలి. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ చాహత్ బాచ్ పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, డీఎంహెచ్వో అప్పయ్య, డీఈఓ వాసంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వ్యాల వల్ల ద్రవ్యం మాత్రమే కాదు, జీవితం కూడా వృథా అవుతుంది, -విద్యార్థులు, యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు.

**-జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ .**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 22 ( వుదయం జిల్లా ప్రతినిధి) జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. డ్రగ్స్ వ్యసనం యువత భవిష్యత్తును కూల్చేస్తోందని, దీన్ని అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని స్థాయిలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యాచరణలో భాగంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో విస్తృతంగా మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టబడుతున్నమని అన్నారు.

విద్యార్థులు, గ్రామస్తులు, యువతలో డ్రగ్స్ పై స్పష్టమైన అవగాహన కల్పించి, వాటి దుష్పరిణామాలు గురించి వివరంగా తెలియజేస్తున్నారు. గంజాయిని సమూలంగా నిర్మూలించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం" అని ఎస్పీ స్పష్టం చేశారు. మత్తుకు బానిసై తన జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల వల్ల ద్రవ్యం (డబ్బు) మాత్రమే కాకుండా, వ్యక్తిగత జీవితం, కుటుంబం, భవిష్యత్తు అన్నీ నాశనమవుతాయని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా, అక్రమ రవాణాపై కఠినంగా స్పందిస్తామని, ఎవరైనా మాదకద్రవ్యాల సమాచారాన్ని అందిస్తే గోప్యంగా ఉంచి తగిన చర్యలు తీసుకుంటామని, వివరాలు తెలిస్తే 8712670551 నెంబర్ కి లేదా డయల్ 100 లేదా 1908 కి కాల్ చేసి తెలపాలి అని పేర్కొన్నారు.

# సీఎం,ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

జన్నారం, జూలై 22(వుదయం విలేకరి) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడుమ బొజ్జు పటేల్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, ఆదివాసి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. జీవో నెంబర్ 49ని రద్దు చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం రోజున ఉదయం కవ్వాల్ చౌరస్తా వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ జీవో రద్దు చేయడానికి కృషిచేసిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,ఆదివాసి ముద్దుబిడ్డ మంత్రి సీతక్క,జిల్లా మంత్రి వివేక్,మైనార్టీ గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ లు ప్రత్యేక చొరవ తీసుకుని జీవో రద్దు చేయించడం సంతోషంగా ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మండాడి ననేశ్వర్,ఊర్వత దర్ము, పెంద్రం రాజేశ్వర్,ఆడయి మాణిక్ రావు, మండాడి జంగు, తొడసం గంగు, పేదోర్ బారికరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ ఖాన్ , ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్



దుర్గం లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు సయ్యద్ ఇషక్,లకావత్ నందు నాయక్, షాకీర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.